**శ్రీ రమణ జ్యోతి**
సెప్టెంబర్ 2021

**Sri Ramana Jyothi**
September 2021

ఈ సంచికలో ...

IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 86వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్)** | జి. శ్రీహరిరావు | 11 |
| **3.** | **ఆత్మ సాక్షాత్కారం: భగవాన్ ఉపదేశం** | శ్రీ పి. వెంకట్రామ శర్మ | 19 |
| **4.** | **శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | 25 |
| 5. | Time | Dr. K. Subrahmanian | 30 |
| 6. | Kavyakantha's Chatvarimsat | V. Krithivasan | 37 |
| 7. | Tales from Arunachalam | Swagat Patnaik | 40 |
| 8. | Purposeful Action | Sneha Choudhury | 45 |
| 9. | Nothing Can Be Greater Than Your Grace | | 48 |
| 10. | How I came into the fold of Sri Bhagawan | Smt. G. Naga Rajeswari | 49 |

## Events in Sri Ramana Kendram in September 2021

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 3rd & 30th September - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.

(Devotees may please note that due to social distancing, *satsangs* are being held online. For details, please contact Kendram Office)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# ఆయన లోపలే వున్నాడు

డా॥ కే.యస్. గారి 86వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

న కర్మణా న ప్రజయా ధనేన .... తస్య ప్రకృతి లీనస్య యః పరస్స మహేశ్వరః ॥ ఈ శ్లోకం యొక్క అర్థాన్ని గురించి మనం చర్చించుకుంటూ వుంటాం. బాహ్యం నుండి మనం సుఖాన్ని పొందలేము. ఎంతో ధనం వుండి, మన సంతానానికి కూడ సంపద వుండి, మనకు మంచి ఉద్యోగం వుంటే, మనం ఆనందంగా వుండగలమని భావిస్తాం. కాని శాశ్వతమైన తృప్తిని ఇవేవీ ఇవ్వలేవని మనకు తెలియవస్తుంది. సంపాదించే కొద్దీ, మరింత ఆర్జన చేయాలన్న కోరిక కలుగుతుంది. కొంత కాలం తరువాత ఆ సంపదతో ఇతరులపై అధికారంలో వున్న వారిపై ధనశక్తితో అధికారం పొందాలన్న ఆశ మొలుస్తుంది. అంటే, ఆ శక్తిని మరింత పెంచుకోవాలనిపిస్తుంది. అదీ పనిచేయదని కొంత కాలం తరువాత గుర్తిస్తాం. ఏదో కారణం వల్ల ఆ వ్యక్తులు అధికారం కోల్పోతారు. పిదప ఆ స్థానంలోకి వచ్చిన వారు మిమ్మల్ని శత్రువుగా భావించవచ్చు. ఇవన్నీ సహజంగా జరిగే పరిణామాలే.

ఇక సామాజికపరమైన కార్యాలు. చేసే పనులు మంచివైతే, ప్రజలు మెచ్చుకుంటారు. కాని ఒక పరిమితి దాటిన తరువాత, సమాజం నీవు పేరు, ప్రఖ్యాతులు, వార్తాపత్రికలలో, మేగజైన్లు మెచ్చుకొనడాని కోసమే మితిమీరి చేస్తున్నావన్న విమర్శలు

పుట్టుకొస్తాయి. జనం ఎంత కృతఘ్నులని అనుకోవలసి వస్తుంది. ఒకవేళ చేసిన పని మంచిది కాకపోతే ఫలితం గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ఇంతకూ అసలు విషయం ఏమిటంటే, ఇతరుల నుండి ఏమైనా ఆశిస్తే సుఖమన్నది వుండదు.

## సంతానం, అసంతృప్తి

సంతానం విషయమూ అంతే. ఫలితం సుఖాన్ని లేదా దుః ఖాన్ని కలిగించవచ్చు కూడ. మీ కొడుకు అద్భుతమైన గుణవంతుడు కావచ్చు. వివాహమై సంతానవంతుడైన తరువాత అతడు మిమ్మల్ని చిన్నచూపు చూడవచ్చు, లేదా మీరు అలాగ భావించవచ్చు. ఇక ఆలోచనలు మొదలౌతాయి. అతని కోసం ఇంత చేశానే, నన్ను పట్టించుకోవడం లేదే, భార్యా, పిల్లలే ముఖ్యమైపోయారే అని చింత. వారి నుండి ఏదో ఆశిస్తున్నందు వల్ల ఏర్పడే అశాంతి అది. అలాగే, కూతురు అంటే ఎక్కువ ఆప్యాయత వున్నప్పుడు అల్లుడు సరిగా లేడనీ, ఇక మనుమలు, మనుమరాండ్లను సరిగా చూసుకుంటారా అనీ, ఇలా ఏదో ఒక విషయంలో దుఃఖం. సంతానం ఆర్థికంగా లేదా తీవ్రమైన అనారోగ్యపరంగా ఇబ్బంది లేనివారైతే వాళ్ళు తమను తాము చూసుకోగలరని ఏ దిగులూ వుండదు. మొత్తం మీద ఈ అసంతృప్తి, బాధ ఏదో రకంగా పీడిస్తూ వుంటాయి.

సగటు మనిషి స్థాయిలోనే పరిస్థితి ఇలాగ వుంటే, దైవిక స్థాయిలో ఎలా వుంటుంది? ఎవరైనా నాకు ఏమీ అక్కర లేదు,

దైవధ్యానం చేసుకుంటాను, ఆయననే నమ్ముకుంటాను అన్న ధోరణి కనపరిచి, ఏ చింతా లేకుంటే, వాళ్ళ పట్ల భగవంతుడు బాధ్యత వహిస్తాడు. మనం మామూలుగా భావించే రీతిలో కాకుండ మరింత బాధ్యత వుంటుంది. తనకు పూర్తి శరణాగతి చెందినవారి సర్వమూ ఆయన బాధ్యతే. రమణ మహర్షి అలాంటి స్థాయిలో అరుణాచలానికి శరణాగతి చెందాడు. అలాంటి భక్తుల కనీస అవసరాలకు ఏ లోపమూ లేకుండ అరుణాచలేశ్వరుడే సదా గమనించి కాపాడారు. అది మనం కోరుకొనే ఆహారం అనుకోవడం కాదు మనుగడకు ముఖ్యంగా అవసరమైన ఆహారాన్ని అందించారు.

**ఎక్కడున్నా ఒకటే**

అందుకని ఈ శ్లోకం యొక్క అర్థం ఏమిటంటే, మనకు సంతానం వల్ల గాని, సంపద వల్ల గాని, ఎక్కువగా ఏదేదో కార్యాలు చేయడం ద్వారా గాని, సుఖ, సంతోషాలు లభించవు. కాని ఈ విషయాన్ని మనం నమ్మము. ఇతరుల నుండి ఏమీ ఆశించకుండ ఎవరికైనా మంచి చేస్తే మనకు సంతోషమవుతుంది. కాని అది ఏదో, ఎప్పుడో ఒకసారికే పరిమితమౌతుంది. ఎప్పుడూ అలాగ చేస్తూ వుండలేము. మన స్వంతం కోసం పనులు చేసుకొంటుంటే, మనకు మరిన్ని సమస్యలు వస్తాయి. ధనం, పేరు ప్రతిష్టలు ఇవి సమస్యలను సృష్టిస్తాయని కొందరు మాత్రం భావించవచ్చు. ఏ పనినీ మీరు చేస్తున్నారని భావించకండి. కార్యం చేసిన తరువాత

దాని గురించి మరచిపొండి. అహాన్ని త్యజించినపుడు, మరేదో ఉన్నత శక్తి మీ ద్వారా చేయించిందన్న భావన ఏర్పరచుకోవాలి. మునులు, ఋషులు అలాంటి వారి త్యాగ భావన వలనే అమృతత్వాన్ని పొందారు. ఇక్కడ త్యాగం అంటే, ఇంటిని, సంసారాన్ని వదలిపెట్టి, అడవుల్లోకి వెళ్ళడమని కాదు. ఆ మనసును లేకుండ చేసుకోవాలని అర్థం. మనసున్న చోట అలజడి వుంటుంది. మీరు మీ గృహంలో వున్నారా, అడవిలో వున్నారా అన్నది ముఖ్యం కాదు. మనుష్యుల మధ్యలో వున్నప్పుడు కూడ ఏకాంతతను అనుభవించ వచ్చునని భగవాన్ అంటారు. మనసు నిశ్చలంగా లేకుంటే, ప్రజల మధ్యలో వున్నా, అడవిలో వున్నా కూడ, ఇంట్లోని భార్యాపిల్లల గురించి తలచుకుంటూ వుంటే, అలజడి కలుగుతూనే వుంటుంది. వాళ్ళను ఎందుకు వదలిపెట్టివచ్చామన్న చింత వుండనే వుంటుంది. ఇంట్లోనే వున్నప్పటికీ, చుట్టూ ఇతరులు వున్నప్పటికీ, మనసు స్థిరంగా వుంటే శాంతిగానే వుంటుంది. అహాన్ని త్యజించడ మన్నది ఎలా సాధ్యమౌతుంది? ఋషులు, మునులు, అది సాధించ డానికి ఎక్కడికో వెళ్ళడం కాదు, తమ లోపలి నుండే వీలవుతుందని గ్రహించారు. మన హృదయ గుహలో నెలవైవున్న ఆ పరమాత్మ యొక్క ధ్యానాన్ని సాగించాలి. మనం ఆయనను బాహ్యంలో వెదుకుతుంటాం. మనలోపలే నెలకొని వున్నాడన్న జ్ఞానాన్ని ఆయన కృప వల్ల తెలుసుకున్న క్షణంలో, బాహ్య అన్వేషణ ఆగిపోతుంది. మనలోనే ఆ విశ్వేశ్వరుడు వున్నాడన్న జ్ఞానాన్ని ఏదో మేధోపరంగా కాకుండ, సహజంగా అవగాహన చేసుకుంటే, అప్పుడు మీరే 'అది' అవుతారు.

## కోపం దుఃఖానికి కారణం

మామూలుగా, మీరు కోపంగా వున్నప్పుడు, 'నేను కోపంగా వున్నాను' అని అంటే, మీరో కోపంగా వున్నట్లా? మరో విధంగా చెప్పాలంటే, మీరు నిజంగా కోపంగా వుంటే, అలాగ 'నేను కోపంగా వున్నాను' అని చెప్పలేరు. యథార్థంగా కోపంగా వుండి వుంటే, ఆ విషయం మీకు తెలీదు. ఆ విషయం మీకు తెలిసిన క్షణంలో మీరు నిజంగా కోపంగా లేరు. ఎందుకంటే, కోపం అన్నది ఒక 'తాత్కాలిక' మతిభ్రంశం, అంటే పిచ్చితనం లాంటిది. మతి భ్రమించిన వ్యక్తి, మన మాదిరిగా ప్రవర్తించలేడు. అప్పుడు తన మీద తనకు అదుపులేని స్థితిలో వుంటాడు, హేతుబద్ధంగా మాట్లాడలేడు. వ్యక్తి కోపంతో వుంటే మూర్తీభవించిన కోపమే అయివుంటాడు. అలాగే ఎవరైనా నిజంగా ఈర్ష్యతో వుంటే, అతను ఈర్ష్య, దుఃఖంతో కృంగిపోయి వుంటే, అతనే దుఃఖం. ఉదాహరణకు మీ కోపానికి, నా కోపానికి, అలాగే మీ దుఃఖానికి, నా దుఃఖానికి తేడా వుంటుందా? ఉండదు. అలాంటి సందర్భాలలో ఒకరినొకరు పరిస్థితిని పూర్తిగా అవగాహన చేసుకుంటారు. దుః ఖం గురించి మాట్లాడుతున్నప్పుడు, దుఃఖం ఒకటే అయి వుంటుంది. కాని దానికి గల కారణాలు వేరువేరుగా వుండవచ్చు, వ్యక్తులను బట్టి కారణం మారుతూ వుండవచ్చు.

గౌతమబుద్ధుడు, కూడ ప్రతి ఒక్కరికీ దుఃఖం వుంటుంది. కాని ఒకరి స్థానంలో మరొకరు వుండలేరు గనుక, 'నీ బాధ, నా బాధ' అంటూ మాట్లాడతామన్నాడు. దుఃఖానికి మూలకారణం

గురించి ప్రశ్నించినప్పుడు, వాటికి కోరికయే మూల కారణమన్నాడు. మనకు ఏదో కావాలన్న కోరిక కలిగినప్పుడు, దానితో అనుబంధం పెరుగుతుంది. అలాగే, దేనినైనా చూసినప్పుడు, దానిని గురించిన ఒక అభిప్రాయం ఏర్పడుతుంది. ఏది ఏమైనప్పటికి, దాని గురించి ఆలోచించడం జరుగుతుంది. దానిని పొందితే బాగుంటుందని లోలోపలే అనుకుంటాం. ఇక దానిని సాధించడానికి ప్రయత్నాలు చేస్తాం. నిజంగానే దాని కోసం కష్టపడతాం. ఆ దిశలో ప్రయత్నాలకు అడ్డంకులు రావచ్చు. సులభమనుకున్నది అలాగ కష్టసాధ్యమౌతుంటే, కోపం వస్తుంది. ఒక వ్యక్తిపై అలాగ కోపం కలిగినప్పుడు ఏం జరుగుతుంది? అతడిని గురించిన అభిప్రాయం మారుతుంది. అతడు అంత మంచివాడు కాదు. నేను అడిగిన దానిని సులభంగా ఇచ్చి వుండవచ్చు అని ఇతరులతో చెప్పడం మొదలు పెడతాం. అతనితో తొలుత వుండిన సత్సంబంధం పాడవుతుంది. పనికిమాలిన వాడని, నమ్మలేని వాడని ప్రచారం మొదలౌతుంది. మొత్తం వ్యవహారం బెడిసి కొడుతుంది.

## సత్సంగమే సమాధానం

కోరికతో మొదలైనది, అడ్డంకులు ఏర్పడినప్పుడు కోపానికి దారి తీస్తుంది. ఇక ముందు, వెనుకలు చూడడమంటూ వుండదు. అసలు ఎదుకు ఒక వ్యక్తి తాను కోరినది ఇవ్వలేకపోతున్నాడన్నది తెలుసుకొనడము వుండదు. అవతలి మనిషిని ఒక వ్యక్తిగా పరిగణనలోకి తీసుకోవడం మానివేయడం జరుగుతుంది. ఇంతకు

ముందు అనుకున్నట్లు, కోపం, అయిష్టతలకు మూల కారణం కోరిక. యిష్టపడేదాన్ని నిరంతరం తలుచుకుంటే కావాలన్న కోరిక మొదలౌతుంది. అయిష్టమైనది మరీ మరీ తటస్థపడితే చాలా చిరాకు వేస్తుంది. అందుకే సత్సంగంలో వున్నప్పుడు ఏ కోరికలు తలెత్తినప్పటికీ, వాటిని ఎదుర్కొనగలుగుతాం. అది మంచిది కాదని, దాని పట్ల అనుబంధం ఏర్పరచుకోకుండ దూరమవుతాం. సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే, నిర్మోహత్వం... మంచి, చెడుల మధ్య అలాగ వివేచనతో తేడాను గ్రహించగలగడం దైవ కృప వల్ల సాధ్యమౌతుంది. ప్రపంచంలో కోట్లానుకోట్ల వస్తువులుంటాయి. ఆకర్షణతో వాటి వెంటబడుతూ పోతే, అంతు ఎక్కడ? హద్దు అన్నది ఒకటి వుండాలి. అందుకే సత్సంగం చాలా ముఖ్యమని భగవాన్ అంటారు. అదేదో అప్పుడప్పుడు మొక్కుబడిగా పాల్గొనే కార్యక్రమం కాదు. మరి ఎల్లప్పుడూ సత్సంగంలోనే వుండడం సాధ్యమౌతుందా? అవుతుంది. ఎలాగంటే, నిరంతరం, భగవంతుని కృపతో ఆయనను గురించి మాత్రమే తలుచుకుంటే, అదే సత్సంగం. దైవకృపను పొందినప్పుడు, ఆయన మనలోనే వున్నాడు, మరెక్కడో లేడన్న స్ఫురణ కలగడంతో, వేరుగా ఆయన గురించి ఆలోచించ నవసరం లేదు కదా అన్న సత్యం తెలియవస్తుంది. ప్రత్యేకించి ఆయన గురించి ఆలోచించనప్పటికీ, సత్సంగంలో వున్నట్లే. కాని మనమూ ఆయన వేరు కాదన్న నమ్మకం కలిగి వుండాలి. ఆ భావన బలంగా వుంటే, మనకు లభించినది మనం గ్రహిద్దాం, లభించకుంటే వాటి

కోసం ప్రాకులాడడం అంటూ వుండదు. విశ్వప్రభువు మనలోనే వున్నప్పుడు, ఆయన ఇవ్వలేనిది ఏముంటుంది? ఇక అడగాల్సింది ఏముంటుంది? జీవితమంతా సుఖ, సంతోషాల మయమే. ఆ స్థితిలో ఇతరులకు భిన్నంగా లేకుండ అందరి మాదిరిగా వుంటారు. మీరు అధికులని, ఇతరులు తక్కువ స్థాయికి చెందినవారన్న భేదాలు వుండవు. మీలోనే పరమాత్ముడున్నాడన్న విశ్వాసం కలిగినప్పుడు, ఆయన అందరిలోనూ అలాగే వుంటాడన్న సత్యాన్ని గ్రహిస్తారు. ఆయన్ను అడగడానికి ఇక ఏముంటుంది? మీకేమి అవసరమో ఆయనకు తెలుసు; అలాగే ఏమి ఇవ్వకూడదో కూడ. అప్పుడు తృప్తి, శాంతి లభిస్తాయి.

**ఆత్మ సాక్షాత్కారము**

**నిర్వికల్ప మచిన్త్యంచ**
**హేతుదృష్టాన్తవర్జితమ్ ।**
**తత్సుఖం పరమం ప్రోక్త**
**మాత్యన్తిక మనైపమమ్ ॥**

తా॥ మార్పులేనిదియు నాలోచింపదగనిదియు హేతుదృష్టాంతముల వదిలినదియునగు నా సుఖము (పరమాత్మ సుఖము) సాటిలేనిదై, మిగుల నుత్తమమని చెప్పబడినది.

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ మొదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

ఆ తరువాత, అచిరకాలంలోనే శ్రీ భగవాన్ నన్ను ఈ వ్యాధి నుండి విముక్తుణ్ణి చేశారు. 'వేపసారం' అనే మందు బెంగాల్ కెమికల్స్ వారు తయారు చేసేవారు. మద్రాసులో ఒక ప్రదర్శనలో నేనీ మందును చూడటం సంభవించింది. శ్రీ భగవానే నాకు నేనుగా ఈ మందును వేసుకునేలాగా చేశారని నా నమ్మకం. రెండు మూడు నెలలు వాడి చూస్తే చాలా మెరుగు కనిపించింది. అలాగే రెండు సంవత్సరాలు ఈ మందు వాడకం కొనసాగించాను. 1943 నాటికి ఆ వ్యాధి పూర్తిగా మాయమైపోయింది. అలోపతీ, ఆయుర్వేదం, హోమియోపతి, యునానీ, అలా ఎన్నో మందులకు లొంగని ఈ వ్యాధి, శ్రీ భగవాన్ కృపతో వేపాకు మందుతో మాయమైపోయింది. నమ్మకం లేని వారు, వేపాకు సారంతో వ్యాధి నివారణ కలిగిందని అనుకోవచ్చు. నామట్టుకు నేను అది కేవలం శ్రీ భగవాన్ కరుణ వల్లనే అని పూర్తిగా నమ్ముతాను. ప్రఖ్యాతి చెందిన డా. గురుస్వామి ముదలియారుగారు నాకు బాగా సన్నిహితులు. వారు అనేక మందులు వాడి, అలోపతిలో ఈ వ్యాధికి మందులేదని తేల్చి చెప్పేశారు. నన్ను దేవీ పండిట్ కన్నప్ప అనే వారి దగ్గరకు పంపించారు - వారు తయారు చేసే తైలము, సిందూరమూ వాడితే, మెరుగు లభిస్తుందనేమోననే ఉద్దేశ్యంతో! అని కూడా పెద్దగా లాభించలేదు. ఎంతో పేరున్న అనేకమంది వైద్యులను

సంప్రదించాను - ఆయుర్వేద వైద్యంతో సహా! కొన్ని సంవత్సరాలుగా రక్త శుద్ధి కోసము కలకత్తా కవిరాజుల మందులు వాడుతూ వస్తున్నాను. ఇంకా 'నరసపరిపల్లాన్' మామూలుగానూ, అయోడైజ్‌డు గానూ కూడా వాడి చూశాను. ఇక ఇతరత్రా ఆయింటు మెంట్లూ, లోషన్లూ అయితే లేక్కేలేదు. చాలా ఇంజక్షన్లు కూడా తీసుకున్నాను. ఏమీ లాభం లేకపోయింది. అందువల్ల ఈ వేపమందుతో నా వ్యాధి నయమైనదని నేను నమ్మను. శ్రీ భగవాన్ నా ప్రార్థనలను మన్నించి, తమ కరుణను బయటకు తెలియనీయ కుండా కప్పివుంచి ఈ వేపమందుతో నా వ్యాధి నయం చేశారు. ఈ మందు గురించి ఏ ఒక్క డాక్టరూ నాకు ఏనాడూ చెప్పలేదు.

నేను చివరిసారిగా చిత్తూరు జిల్లా వదిలి వెళ్ళడానికి ఒక నెల ముందు అనుకుంటాను. శ్రీ భగవాన్ నాకు చాలా సంతోషదాయక మయిన అనుభవాన్ని ప్రసాదించారు. నా జీవితంలో అంతటి అద్భుత అనుభవాన్ని నేను అంతవరకూ పొందలేదు. ఆ వివరాలు ఇక్కడ చెప్పనవసరము లేదు కానీ, ఒక మాట చెప్పాలి. ఆ సందర్భంలో నేను తీసుకోవలసిన నిర్ణయాన్ని గురించి చీటీలు వేశాను. శ్రీ భగవాన్ 'వద్దు' అని నిర్ణయమిచ్చారు. వారి సలహా పాటించాను. నాకెట్టి అపకారమూ, జరగలేదు. శ్రీ భగవాన్ నాపట్ల ఎంత కరుణ చూపిస్తున్నారో నాకు అవగతమయినది.

ఈ చీటీలు వేయడం గురించి, శ్రీ భగవాన్‌తో నా సంభాషణ గురించి ఇక్కడ చెప్పాలి. అంతకుముందు, కొంతకాలం క్రితం, ఏదో సందర్భంలో నేను శ్రీ భగవాన్‌తో ఈ విషయం ప్రస్తావిస్తూ

'భగవాన్! ఏదైనా సంశయాత్మక సన్నివేశాలలో మా వాళ్ళు దేవుడి దగ్గర మార్గనిర్దేశం కోసం చీటీలు వేస్తారు. ఇలాంటి పద్ధతులు పని చేస్తాయా? అని అడిగాను. "నమ్మకం ఉంటే తప్పకుండా పని చేస్తాయి" అని సెలవిచ్చారు శ్రీ భగవాన్.

అప్పటినుండి, నాకెప్పుడు ఎలాంటి సందేహము వచ్చినా, శ్రీ భగవాన్‌ను తలుచుకొని చీటీలు వేసి వాటి ప్రకారం నడుచుకునే వాడిని. శ్రీ భగవాన్ చెప్పారు కాబట్టీ, నా కెటువంటి ఆపద రాదని నా గట్టి నమ్మకం. నేనింతకు ముందు చెప్పిన సందర్భం అలాంటిదే. శ్రీ భగవాన్ భక్తులు కొంత మంది కూడా యిలాగే శ్రీ భగవాన్ పటం ముందు చీటీలు వేసి మార్గనిర్దేశకత్వాన్ని కోరుకుంటారని నాకు తెలుసు. వారి వారి నమ్మకం బట్టీ ఫలితాలు వుంటాయని నా భావన. చిత్తూరు నుండి శాశ్వతంగా శ్రీ భగవాన్ దగ్గరకు వెళ్ళి పోయేముందు జరిగిన ఇంకొక సంఘటన గురించి ఇక్కడ తెలియ పరచాలి. ఆ కాలంలో చిత్తూరులో ఒక సబ్ జడ్జిగారుండే వారు. నన్ను చిరాకు పరచడానికీ, ఇబ్బందులు పెట్టడానికీ, చివరకు నాకు హాని కలగచేయడానికి కూడా - శతవిధాల ప్రయత్నించే వారు. నాకు గుర్తున్న వరకు, నేను ఇతర అధికారులతో ఎలా ప్రవర్తించానో, వీరితో కూడా, అలాగే ప్రవర్తించాను. ఎటువంటి పొరపాటూ చేయలేదని నా నమ్మిక. బహుశా, ఆయన కోపానికి కారణం నేను ఆయనకు వంగి వంగి సలాములు చేయలేదనీ, ఆయన కోరుకున్న అతి విధేయత చూపించలేదనీ అయి ఉండవచ్చు. ఇతర అఫీషియల్ రిసీవర్లు అట్లా ప్రవర్తించడం కద్దు.

ఒకసారి, అఫీషియల్ రిసీవరుగా నేను దాఖలా చేసిన ఒక ఆర్జీ తీర్పుకు వచ్చినప్పుడు నేను కోర్టులో లేక పోవడం ఆయన గమనించారు. ఆర్జీని కొట్టి వేయడమే కాక, కేసు తాలూకా ఖర్చులను నేను వ్యక్తిగతంగా భరించాలని ఆర్డరు వేశారు. ఆ రోజు అర్జీ వాదనలు వినడానికి వస్తుందని నాకు తెలుసుకానీ పిటీషన్ కోసం నేను వకీలును నియమించి ఉన్నందున, నేను వెళ్ళాల్సిన అవసరం లేదు.

కానీ ఆ కేసు కోర్టు బయటే పరిష్కారమైపోయినందున, ఆ వకీలు గారు కోర్టుకు వెళ్ళలేదు. ప్రస్తుతం (1960 ప్రాంతంలో) మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వున్న రాజమన్నార్ ఆ రోజు నాకు అతిథిగా ఉన్నారు. ఈ సంఘటన సమయంలో ఆయన కోర్టులో వేరే కేసు సందర్భంగా ఉండటం వల్ల, జరిగినది గమనించారు. వెంటనే తన కారును నాకు పంపించి, డ్రైవరుతో నన్ను వెంటనే సబ్ కోర్టుకు రమ్మని కబురు పంపారు. ఆయనకు కానీ, ఇతర న్యాయవాదులకు గానీ, జడ్జిగారు ఇచ్చిన ఆదేశము సబబు అనిపించలేదు. చాలా ప్రత్యేకమయిన సందర్భాలలోనే అలాంటి ఆదేశమివ్వబడుతుంది. ప్రస్తుత సందర్భమలాంటిది కాదు. నేను వెంటనే కోర్టుకు పరిగెత్తుకు వెళ్ళి చేయవలసిన పనులు చూసుకున్నాను. సబ్ జడ్జీగారిని కలుసుకుని, ఆర్డరును మార్చమని అర్థించే అవసరము లేకుండానే, అవతలి పార్టీ వాళ్ళు ఖర్చులు ఏమీ కోరడం లేదని కాగితంలో రాసి ఇచ్చారు. ఈ ఉదంతం తరువాత నేను శ్రీ భగవాన్‌కు ఆ సబ్ జడ్జీగారి అభ్యంతరకర మయిన ప్రవర్తనను వివరిస్తూ, వారు పెట్టే ఇబ్బందుల నుండీ

నన్ను కాపాడాలని వేడుతూ ఒక జాబు వ్రాశాను. శ్రీ సుబ్రహ్మణ్య స్వామిని ప్రార్థిస్తూ పాడే ఈ కీర్తనను ఉదహరించాను; స్వామికి ప్రియమైన భక్తులకు ఎవరైనా కీడు తలబెడితే, వారి శూలం అటువంటి వాళ్ళ కుటుంబాన్ని మొత్తం పెకలించి వేసి, భక్తులకు సంపూర్ణ రక్షణ కలిగించాలనేది ఆ ఆర్తనాద భావం. ఆ జడ్జీకి ఎటువంటి అపకారం కలగాలని నా ఉద్దేశం కాదు కానీ, నాకు రక్షణ కలిపించాలనేదే నా ప్రార్థన. శ్రీ భగవాన్‌కు ఈ ఉత్తరం రాసిన తరువాత ఆ జడ్జీగారు నాకు ఎటువంటి ఇబ్బందీ కలిగించ లేదు.

నాకు సంబంధించినది కాకపోయినా, ఇటువంటి సంఘటనే ఇంకొక దాని గురించీ తెలియచేయాలి. నేను ఆశ్రమంలో శాశ్వత నివాసం ఏర్పరచుకున్న తరువాత, శ్రీ నారాయణ అయ్యరు అనే ఇంకొక పరమ భక్తునకు సంబంధించిన సంఘటన ఇది. వారిని అకస్మాత్తుగా తిరువణ్ణామల నుండి తిరుచినాపల్లికి బదిలీ చేశారు. రిజిస్ట్రేషన్ డిపార్టుమెంటులో ఒక ఉద్యోగి వుద్దేశ్యపూర్వకంగా చేసిన దుర్మార్గానికి ఫలితమిది. శ్రీ భగవాన్ నుండి అంత దూరం పంపించ వేయబడటాన్ని భరించలేకపోయారు శ్రీ నారాయణయ్యర్. ఒక శత్రువు, కావాలని చేసిన పని ఇది అని నా నమ్మిక. నారాయ ణయ్యరుగారికి హాని చేయడమే అతని వుద్దేశము. అందువల్ల నేను శ్రీ భగవాన్‌తో మొర పెట్టుకున్నాను ‘‘కావాలని ఎవరో మమ్మల్ని ఆపదకు గురి చేయాలని ప్రయత్నిస్తున్నప్పుడు శ్రీ భగవాన్ ఆదుకోవాలి కదా? ఊరికే ఎలా వుంటారు? ఆయన బదిలీ ప్రజా సంక్షేమము కొరకు గానీ, మామూలుగా జరిగే బదిలీ కానీ కాదు.

ఒక కక్షతో చేసిన పని. శ్రీ భగవాన్ కాపాడాలి''.

మరుసటి రోజు, శ్రీ భగవాన్ సన్నిధిలో ఇంతకు ముందు పాడిన పాటను మొత్తము పాడాను. సరిగ్గా ''తడిక్కుమ్ అడి అవర్... అని పాడుతున్నప్పుడు శ్రీ నారాయణయ్యరు వచ్చారు. ''చూడు! సరిగ్గా నువ్వా చరణం పాడుతున్నప్పుడు ఆయనే వచ్చారు''.

నేనూ, నారాయణయ్యరు గారు ఇది శుభసూచకంగా భావించాము. ఆయన తిరుచ్చి వెళ్ళి దగ్గరలో నున్న దేవాలయా లన్నింటినీ దర్శనం చేసుకొని వారం రోజులలో తిరిగి వచ్చారు. ఆయన బదిలీ రద్దు చేసి తిరువణ్ణామలకు దగ్గరే వున్న తిరుక్కోయి లూరుకు పంపించారు.

ఆగష్టు 1943 వరకూ, ఆశ్రమంలో స్థిర నివాసమునకు ముందు నాకు కలిగిన అనుభవాలను ముగించే ముందు, ఇంకో సంగతి చెప్పాలి.

శ్రీ భగవాన్ దగ్గరకు వెళ్ళిన ప్రతిసారీ, ఏదో తినుబండారము శ్రీ వారికి ప్రసాదంగా తీసుకు వెళ్ళటం అలవాటు. నాకు తీపి పదార్థాలు ఇష్టం కనుక ప్రతిసారీ, తీపి పదార్థాలే తీసుకు వెళ్ళేవాడిని. ఒకసారి శ్రీ భగవాన్ కోసం ప్రత్యేకంగా చేయించబడిన బాదం హల్వా తీసుకువెళ్ళాను. ప్రసాద వితరణ చేసిన వారు శ్రీ భగవాన్ విస్తరిలో కొంచెం ఎక్కువగానే వడ్డించారు. అయితే, ఇతరుల కంటే పెద్ద ఎక్కువేమి కాదు. శ్రీ భగవాన్ వడ్డించిన వారిని కోప్పడ్డారు: ''నాకు తీపి సరి పడదని తెలుసుకదా! ముదలియారు గారు తెచ్చారని తీసుకుంటున్నాను. మీరేమో ఇంత వడ్డిస్తారు''.

శ్రీ భగవాన్ కఫంతో చాలా కాలంగా బాధపడుతున్నారు. తీపి పదార్థాలు తినడంతో ఈ కఫం యెక్కువౌతుందని వారి వుద్దేశము. అంతే కాకుండా, నాకు తెలిసినంత వరకూ శ్రీ భగవాన్ తీపి కంటే కారం ఎక్కువగా ఇష్టపడతారని గమనించాను. వేరొక సందర్భంలో, ఇంకో భక్తుడు శ్రీ భగవాన్ కొరకు బాదం హల్వా తెచ్చినప్పుడు, ఆయనకు చెప్పినట్లుగా మాట్లాడుతూ నాకు తెలియపరిచారు. శ్రీ భగవాన్ ఏమి తేవాలనే దానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వరాదని సూచించారు. మన చిరకాల సంప్రదాయాన్ననుసరించి, ఒక మహాత్ముని దగ్గరకు వెళ్ళేటప్పుడు వట్టి చేతులతో వెళ్ళకుండా ఏదో ఒక ప్రసాదము తీసుకువెళ్ళడానికి వారు అభ్యంతర పెట్టలేదు. కానీ దానికింత కష్టపడటమెందుకు? బాదం హల్వా మీ దృష్టిలోనే గొప్పది!'' అని మందలించినట్లుగా అన్నారు.

నేను మళ్ళీసారి వెళ్ళినప్పుడు కేవలము పండ్లు మాత్రమే పట్టుకెళ్ళాను. బయలుదేరే ముందు ఒక ఉత్తరము కూడా వ్రాశాను: ''ఈసారి నేను తమ పాదాల దగ్గర వుంచడానికి పండ్లు మాత్రమే తెస్తున్నాను. శ్రీ భగవాన్‌కు, తీపికంటే, ఇవి ఆమోదకరమవుతాయని భావిస్తున్నాను.

ఈసారి నా నివేదనగా తిరువాచకం నుండి 'శివపురాణమ్' పాడాను. ఈ నా ప్రవర్తనను శ్రీ భగవాన్ ఆమోదించి సంతోషించి నట్లుగా నేను నమ్మాను. ఇంకొకసారి వెళ్ళినప్పుడు, 'తిరుప్పుగళ్' నుండి పద్యము పాడాను. నేను పద్యాలు కంఠతా పట్టి ఒక చిన్న బాలుడు తన తండ్రి వద్ద అప్పచెప్పినట్లుగా పాడేవాడిని. వారెంత దయతో నా పాటలు వినేవారో నేను వర్ణించలేను.

''శరవణ కన్యకల చేత పోషింపబడి షణ్ముఖుడైన సుబ్రహ్మణ్యస్వామిని తలుచుకుంటూ తన్మయత్వంతో కీర్తిస్తూ వేడుకొనే భక్తుల కన్నుల నుండి జాలువారే అశ్రుధారలతో జలక మాడుతూ, ఏ భక్తులైతే నీ స్తోత్రాలను గట్టిగా కీర్తిస్తూ అందరినీ ఆహ్వానిస్తూ వుంటారో, అట్టి వారిని నీవు ఆదరించి రక్షిస్తావు''

అని నేను పాడుతున్నప్పుడు శ్రీ భగవాన్ చలించిపోయి వారి కళ్ళనుండి నీళ్ళు కారాయి.

మరోసారి నేను వేలువగుప్పు పాట నేర్చుకొని వచ్చాను. ఎప్పటి లాగే శ్రీభగవాన్ తన సహజమైన కరుణతో విన్నారు. 'ఆ రాక్షసుని పేగులను తలలో మాలగా చుట్టుకుంటారు,' అనే చరణము వచ్చి నప్పుడు, శ్రీ భగవాన్, తలమీద కొప్పుకు పూలమాల చుట్టుకొను భంగిమ చేసి చూపించారు. వర్ణణా సామర్థ్యములేని నాలాంటి వాడు ఇలాంటి సంఘటనలు తెలియపరచ ప్రయత్నం చేయడం చాలా పేలవంగా వుంటుంది. వినువారికి, చదువరులకు, ఇందులో విశేషమేమున్నది? అన్న భావం కలగడం సహజం. అయితే స్కూలులో పిల్లవాడిలాగా ఈ పాటలను కంఠతా బట్టి, తండ్రి ముందు పాడటం, శ్రీ భగవాన్‌కు నచ్చుతుందని నా నమ్మిక. వారికది నా పుష్పాంజలిగా భావించేవాడిని. శ్రీ భగవాన్ ఆ పాటలను భావయుక్తంగా, ఉద్వేగంగా పాడటానికి నాకు సహాయపడేవారు. తను కూడా ఆ ఉద్వేగంలో పాలు పంచుకునే వారు. నేను ఆ సందర్భాలలో అనుభవించిన శ్రీ భగవాన్ కరుణ ప్రత్యక్షంగా పొందవలసినదే కానీ వర్ణించ శక్యం కానిది. (సశేషం)

# ఆత్మ సాక్షాత్కారం : భగవాన్ ఉపదేశం

శ్రీ వెంకట్రామశర్మ

నా అనుభవంలో ఆత్మ సాక్షాత్కారాన్ని పొందటానికి రెండు మార్గాలున్నాయని అనిపిస్తుంది. మొదటిది నేనేం తెలుసుకోవాలో దాన్ని భగవాన్, నువ్వే నాకు తెలియజేయాలి అని భగవాన్‌ను అడగటమే. ఉపనిషత్తులలో, శాస్త్రాలలో తెలియ చేసిన దాన్ని నాకు అర్థమయ్యే భాషలో తెలియజేయమని అడగటం. ఇది చాలా తేలిక. ఇదే చాలా ఉత్తమమైన మార్గం. ఇక రెండవది (రెండవ మార్గం) సంప్రదాయకంగా ఉపనిషత్తులు, బ్రహ్మసూత్ర భాష్యములు మరియు భగవద్గీతను అవగాహన చేసుకోవటం. ముందు భగవాన్ చెప్పినవి చదివిన తరువాత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్ర భాష్యములు మరియు భగవద్గీత చదవాలి. అప్పుడు భగవాన్ ఏం చెపుతున్నారో చాలా బాగా అర్థమవుతుంది. అలా చేయటం వలన భగవాన్ చెప్పిన దాన్ని ఇంకా బాగా అనుభూతి చెందుతాము.

ఉపనిషత్తులలో కొన్ని వేల సూత్రాలున్నాయి. బ్రహ్మ సూత్రాలు 555 వున్నాయి. ఉపనిషత్తుల యొక్క సారం బ్రహ్మ సూత్రాలు. భగవాన్ యొక్క ఉపదేశాలు బ్రహ్మ సూత్రాల యొక్క సారం అని అనిపిస్తుంది. అవే ఉపదేశసారం, ఉన్నది నలుబది మొదలైనవి. ఇవి మామూలు వ్యక్తులకు అర్థం కావు. ఇవి అర్థం కావాలంటే ముందు భగవద్గీత, ఉపనిషత్తులు మరియు బ్రహ్మ సూత్ర భాష్యాలు అర్థం చేసుకొని, అప్పుడు భగవాన్ ఏం చెప్పారో అనే దాన్ని చదివితే, అప్పుడు మనకు బాగా అర్థమౌతుంది.

ఎందుకంటే భగవాన్ ఇచ్చిన ఉపదేశాలు సర్వోత్క్రుష్టమైనవి. కానీ ఈ రెండవ మార్గం చాలా సమయం తీసుకొంటుంది. కాబట్టి మొదటి మార్గాన్ని అనుసరించి భగవాన్నే అడిగితే, భగవానే మనకు ఆత్మ సాక్షాత్కారాన్ని ఖచ్చితంగా కలుగ చేసేట్టుగా చేస్తారు. మన ద్వారా ఏం తెలియ చేయాలో అది తెలియ చేస్తారు. భగవాన్తో అనుబంధం పెంచుకొన్న వాళ్ళు, ఆధ్యాత్మికంగా పక్వ స్థితిలో ఉన్నవారు, గొప్ప అవగాహన కలవారు. వారు ఈ ప్రపంచంలో ఏ పని చేయనక్కర్లేదు. భగవాన్తో కూర్చోవటమే వారు చేయ వలసినది. మనందరమూ భగవాన్ దగ్గరకు వచ్చామంటే ఇంతకు మునుపు జన్మలలోనే ఎంతో ఆధ్యాత్మిక పురోభివృద్ధిని, ఎన్నో సత్కార్యాలను చేసి వుండి వుంటాం. భగవాన్ను తెలుసుకోవాలంటే అమితమైన భక్తి కలిగి వుండాలి. ఎంతగా అంటే నాకు అన్యంగా భగవాన్ లేరనేంతగా. నేను భగవాన్లో భాగమే అనే భావన వుండాలి. ఇదే నాకు కలిగిన అనుభవం.

అలానే భగవాన్ చెప్పే విచారణ ఏమిటంటే, విచారణ చేస్తున్న వారు యెవరో విచారించమని అంటారు. అంటే దానర్థం, విచారణ అనేది ఒకటి చేస్తున్నాను కాబట్టి నేనున్నాననా? లేదా నేనున్నాను కాబట్టి విచారణ చేస్తున్నాననా? అంటే దానికి సమాధానం నేను అనేవాణ్ని ఒకణ్ణి ఉన్నాను కాబట్టి అని అర్థమౌతుంది. ఆ 'నేను' మనసుతోను, ఇంద్రియాలతోను కూడి వున్నప్పుడు, నేను మాట్లాడుతూ ఉండవచ్చు, పని చేస్తూ ఉండవచ్చు. నిదురపోతూ ఉండవచ్చు (అంటే అసంఘిగా ఉండటం), ఇంకేమైనా చేయవచ్చు. లేదా యేమీ చేయకనూ పోవచ్చు. కానీ ఇదంతా జరిగినా, జరగక

పోయినా మన లోపల ఒకడున్నాడు. ఆ ఉన్నవాడు/ఉన్నది వీటన్నిటితో లింకైనప్పుడు లింకైనట్టుగా ఉంటుంది. లింక్ కానప్పుడు లింక్ కానట్టుగా ఉంటుంది. భగవాన్ చెప్పే 'నేనును పరిశీలించండి' అంటే దానర్థం, 'నేనుగా వుండటం'. ఇక్కడ పరిశీలించటానికి 'నేను' అనేవాడు ఒకడు ఉండాలి కదా. అయితే యిప్పుడు 'నేను యెవరిని'? అంటే, నేను 'ఉన్నవాణ్ని'. అంటే దానర్థం నేనున్నాను అని తెలుసుకోవటానికి విచారణ చేయవలసిన అవసరం యేమీ లేదు. విచారణ చేయక పూర్వం కూడా నేను వున్నాను. అంటే విచారణ చేసినా, చేయక పోయినా నేను అనేవాణ్ణి ఎల్లప్పుడూ వున్నాను. విచారణ చేసే అవసరమున్నది అని అనుకొని విచారణ చేసేవాడిగా మారిపోతే దానర్థం నేను నా స్వరూపం నుండి బయటకు వచ్చేసినట్టే. ఇది భగవాన్ చెప్పిన విచారణా పద్ధతి అని నాకనిపిస్తోంది.

అసంఘంగా ఉన్న 'నేను'ను సహజం (intuitive) గా తెలుసుకొని అలాగే ఉండగలిగితే ఇంక చేయవలసినది ఏమీ లేదు. అలా ఉండటమే. అలా ఉండలేకపోతే కనీసం అసంఘంగా ఉన్న నేను మీద ధ్యాస పెట్టగలగటం అనేది ఇంకొక పద్ధతి. ఉదాహరణకు మనం ఒకరితో ఒకరు మాట్లాడుతున్నప్పుడు కూడా అసంఘంగా వున్నాను అనేది ఒక భావనగానైనా లేదా ఒక ఆలోచనగానైనా అంగీకరించినా, దాని మీద ఎంత ఎక్కువ ధ్యాసను ఉంచ గలిగితే అప్పుడు మనకు ఆ 'వుండటం' అనేది ఏమిటో తెలుస్తుంది. ఇది సహజం (intuitive) గా భగవాన్ చెప్పే ఆత్మ విచారణ అని మనకు తెలుస్తుంది.

ఇది కాకుండా భగవాన్ యింకొకటి కూడా చెప్పినట్టు నాకు అర్థమౌతోంది. అదేమిటంటే ఇప్పుడు నేను చూస్తూ ఉన్నాను. ఎవరు చూస్తున్నారు? అని అడిగితే నేను చూస్తున్నాను అంటాం. అంటే నేను చూచేటటువంటి ఒక తెలివిని లేదా ఎరుకను అని అర్థమౌతోంది. చూడాలనుకొంటే చూస్తాను, లేదంటే లేదు. అంటే నేను చూసేవాడిగా ఉండవచ్చు. చూడనివాడిగా ఉండవచ్చు. లేదంటే ఊరక ఉండవచ్చు. కాబట్టి చూచేవాడిని నేననుకొంటే, ఈ చూస్తున్న నేననుకొనే నేను, నిదురలో లేనట్టు తెలుస్తోంది కదా! అంటే ఈ చూస్తున్న నేను, చూసేది నేను అనుకొనే నేను ఒక సమయంలో ఉన్నట్టుగా, ఇంకొక సమయంలో లేనట్టుగా తెలుస్తోంది. అది జాగ్రదావస్థలో మరియు స్వప్నావస్థలో తెలుస్తోంది. అంటే యిలా చూడబడే నేను, చూసే నేను, చూడటం (త్రిపుటి) అని - యేదనుకొన్నా కూడా సత్యంగా అవన్నీ నేనే. అలానే ఇవేవీ కాకుండానూ నేనున్నాను. దీన్ని కనుక సహజం (intuitive)గా పట్టుకోగలిగితే అప్పుడు భగవాన్ చెప్పిన 'నేను'ను గుర్తించ గలుగుతాము. అంటే చూడక మునుపు వున్న నేను, లేదా ఆలోచించక మునుపు వున్న నేను, అలానే యిప్పుడు వున్న నేను, ఒకటే అనేది అనుభవపూర్వకంగా గుర్తిస్తాము. మరి ఈ చూడగలగటం, చూడటం ఎట్లా వస్తోంది? అంటే ఈ చూపుకు ఏదో ఒకటి శక్తినిస్తోంది అనేది అర్థమౌతుంది. దాన్ని మనం కొంత సేపు సత్యమైన 'నేను' అనే భావన చేద్దాం. అంటే నేను ఇప్పుడు చూస్తున్న వాడిని కాను. ఈ చూస్తున్న దానికి ఆధారం ఇంకొకటి వున్నది అని అనుకొందాం. ఉదాహరణకు బల్బు వెలగటానికి

ఆధారం విద్యుత్ శక్తి అలా అని అనుకొంటే ఇప్పుడు చూస్తున్న నేను, నేను కాదు. నేను చూడటానికి ఇంకొకటి ఏదో దీనితో కూడటం వల్ల నేను చూస్తున్నాను అని అనుకొంటే, దాన్ని యెట్లా తెలుసుకొనేది? అని పరిశీలిస్తూ ఉంటే దాని స్వభావమేమిటో తెలుస్తుంది. దాని స్వభావం ఏమిటి? అంటే చూడటం దాని స్వభావం. అంటే అది నాకు దాని శక్తిని మార్పిడి చేస్తోంది కనుక నేను చూస్తున్నాను. ఈ విధంగా గమనిస్తూ వుంటే ఒకానొక సమయంలో ఒక వెలుగొస్తుంది. అది ఏమని అంటే చూపునిస్తున్న శక్తి అనే నేను, చూచే నేను ఒకటే అని. దీన్నే భగవాన్ ఇలా అన్నారు. సోహం స్ఫూర్తి తయా అరుణాచల పూర్ణో విభూతి స్వయం అని. అంటే నేను, అది ఒకటే అనే స్ఫురణ కలుగుతుంది అని. అది స్వయంప్రకాశం అని తెలుస్తుంది. పరిశీలన చేస్తూ పోతే ఈ అనుభూతిని స్వయంగా గుర్తించ గలుగుతాము. అందుకే భగవాన్ ఇలా అనేవారు. చైతన్యం వున్నది అని తెలుసుకోవటానికి మనస్సు అనేది వుండాలి అని, ఒక జ్ఞాని యొక్క మనస్సు శుద్ధ చైతన్యం మాత్రమే అని అనేవారు. అది ఎప్పుడూ భేదాన్ని చూపించదు. భగవాన్ కూడా ఎన్నో సందర్భాలలో నేను అనేవారు. కానీ ఆ నేను అనేది శుద్ధ చైతన్యమే కానీ, అది శరీర భావనతో కాదు. ఆ శుద్ధ చైతన్యాన్ని ఏవిధంగానూ వ్యక్తీకరించలేము. ఉదాహరణకు ఒక తీపి పదార్థాన్ని రుచి చూస్తే, దాన్ని అనుభూతి చెందవచ్చు కానీ దాన్ని మాటలతో ఎలాగైతే వ్యక్త పరచలేమో అలా శుద్ధ చైతన్యాన్ని అనుభూతి చెందటమే కానీ మాటలతో వ్యక్త పరచలేము. అందుకే అక్కడ మాట కూడా పడిపోతుంది. దీన్నే తైత్తరీయ ఉపనిషత్తులో

ఇలా చెప్పారు. యతో వాచా నివర్తన్తే అప్రాప్యా మనసా సః అని. అంటే ఆ చైతన్యాన్ని వాక్కుల ద్వారా కానీ, మనసు ద్వారా కానీ వర్ణించలేము అని. అదే మౌనమై పోవటం అంటే.

జాగ్రదావస్థలో యేదైనా తెలుస్తున్నదంటే అది మనసు ద్వారా మాత్రమే. కానీ ఈ మనస్సు నిద్రలో లేదు. అందుకే నిద్ర అనేది సాక్షాత్కారానికి దగ్గరగా వుండే స్థితి కానీ సాక్షాత్కారం కాదు అని అంటారు. కాబట్టి ఆత్మ సాక్షాత్కారానికి మనస్సు వుండవలసినదే. మనస్సు అనేది లేకుండా మనస్సుకు అన్యంగా ఇంకొకటి (ఆత్మ) వున్నదనేది ఎలా తెలుస్తుంది? దీన్నే భగవాన్ ఇలా తెలియ చేశారు. భిన్నత్వం ఉంటేనే ఏకత్వం అనేది ఏమిటో తెలుస్తుంది అని. అదే నిజమైన సాక్షాత్కారం. కానీ మన శాస్త్రాలలో దీనిని అపరోక్షాను భూతి అని అన్నారు. సాక్షాత్కారం అనే పదం లేనే లేదు. అనుభూతి రెండు విధాలుగా వుంటుంది. ఒకటి, ఒకరు ఇంకొకరిని చూస్తున్నారు మరియు మాట్లాడుతున్నారు అని అనుకొంటే, అది ప్రత్యక్షానుభూతి. ఒకవేళ కనుక ఆ వ్యక్తి ఇంకొక గదిలో వుండి గట్టిగా మాట్లాడుతూ వున్నాడనుకొందాం. ఆ వ్యక్తి మనకు ముందే తెలుసు అని అనుకొంటే, అప్పుడు మనం పొందే అనుభూతి పరోక్షానుభూతి. ఈ రెండూ అనుభూతులే. అప్పుడు అపరోక్షానుభూతి అంటే ఏమిటి? అంటే పైన చెప్పిన రెండిటినీ అనుభూతి చెందేదేదైతే ఉన్నదో అది అపరోక్షానుభూతి. అదే నీవు. అంటే తెలుసుకొనే వాడవు నీవే, తెలుసుకొనేదీ నీవే, తెలుసు కోవటం అనేది కూడా నీవే. అన్నీ నీవే. ఇది తెలుసుకోవటమే మనం చేయవలసిన సాధన అని నాకు అనిపించింది.

ఓం నమో భగవతే శ్రీరమణాయ

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

## వై.ఎన్. అథావళె

**మల్లాది ఫణిమాల**

శ్రీరమణ భక్తులైనటువంటి శ్రీ వై.ఎన్. అథావళె గారి మాతృభాష మరాఠీ. వీరు శ్రీరమణుల సమక్షంలో ఎంతో శ్రావ్యంగా మరాఠీ భజనలు పాడేవారు. వారు గొంతెత్తి శ్రావ్యంగా మరాఠీ భజనలు పాడుతూ వుంటే, శ్రీ రమణాశ్రమంలో హాలంతా చక్కటి భక్తిపూరితమైన వాతావరణంతో నిండిపోయేది. శ్రీ అథావళె గారు బాల్యం నుండియే ఎంతో ఆధ్యాత్మిక వాతావరణంలో పెరిగారు. శ్రీరమణుల సన్నిధికి రాకమునుపే, అథావళె గారికి మిక్కిలి భక్తి, దైవం పట్ల నమ్మకం మెండుగా ఉండేవి. చిన్నతనంలో వారు పెరిగిన చక్కటి వాతావరణమే దీనికి కారణము.

1939 నుండి 1942 వరకు, వారు సయాటికా నొప్పితో ఎంతో బాధపడ్డారు. సయాటికా వల్ల అథావళె ఎంతగానో నీరసించి పోయారు కూడా. చిన్నతనంలో వారి తాతగారు పూజించే గురువుగారి వంటి గురువు దొరకాలనీ, అటువంటి గురువు సన్నిధానంలో వారు కొంతకాలం గడపాలనీ ఎంతగానో కాంక్షించే వారు శ్రీ అథావళె.

1942, ఫిబ్రవరిలో అథావళె మానసికంగా ఎంతో చితికిపోయి వున్న తరుణంలో, వారికి ఒక విచిత్రమైన కల వచ్చింది. శ్రీరమణులు స్వప్నంలో దర్శనమిచ్చి, భక్తులను ఉద్ధరిస్తారనడానికి

ఇంతకు మించిన ఉదాహరణలేదనే చెప్పాలి. అథావళె గారి జీవితంలో మరువలేని స్వప్నమిది.

స్వప్నంలో వారికి ఒక కొండ. ఆ కొండలో ఒక గుహ. ఆ గుహలో ఒక మహాత్ముడు కూర్చుని ఉన్నట్టు, ఆ మహాత్ముడు దర్శనం కోసం చాలా మంది భక్తులు వెళుతూ కనిపించారు. ఆ భక్తులలో వారు కూడా ఉన్నారు. అలా కాసేపు అందరితో పాటు కొండ ఎక్కి, ఒక నిముషం ఆగి, అక్కడున్న వారిని అథావళె ఇలా అడిగారు. "అదేమిటి, గురువుగారి ప్రవచనం ఇంకా ప్రారంభం కాలేదేమి? మహర్షి ఎక్కడ ఉన్నారు" అని ప్రశ్నించారు. అథావళె అడిగిన ప్రశ్నకు సమాధానంగా, అక్కడున్న ఒక వృద్ధ భక్తుడు, "మౌనమే గురువుగారి ఉపదేశము" వారు మౌనంలోనే శిష్యుల ప్రశ్నలకు సమాధానమిస్తారని చెప్పారు. వృద్ధ భక్తుని మాటలు విన్న అథావళె, అది సరే! కానీ మహర్షి ఎచ్చట ఉన్నారు? అని మళ్ళీ అడిగారు. ఆ ప్రశ్నకు సమాధానంగా మరొక భక్తుడు, "అదిగో మహర్షి మీ వద్దనే కూర్చుని ఉన్నారు" అని అన్నారు. అథావళె చుట్టూ వెతుకగా, అచ్చట కౌపీనము ధరించి, చక్కగా మందహాసా లొలికిస్తూ కూర్చుని వున్న శ్రీరమణులు దర్శనమిచ్చారు. వారికి ప్రణమిల్లి, మీ పేరు ఏమిటని, అథావళె ఆర్తిగా శ్రీ భగవానులను అడిగారు. శ్రీరమణులు వారి హృదయం కేసి చేతివ్రేలిని చూపిస్తూ, "దీనిని 'రమణ మహర్షి' అని అంటారు" అని సెలవిచ్చారు. చక్కటి చిరునవ్వు చిందించుచూ, ఈ మాటలు పలికిన శ్రీరమణుల తేజోవదనాన్ని దర్శించిన అథావళె గారి ఆనందానికి అవధులు

లేకపోయాయి. ఇంతలో హఠాత్తుగా వారికి మెళకువ వచ్చేసింది. సద్గురు దర్శనానికై తపిస్తూ, వారు చేసిన ప్రార్థనలు ఫలించాయన్న భావన అథావళెకు కలిగింది. భగవాన్ శ్రీరమణులు, అథావళెకు ఈ విధంగా స్వప్నదర్శనం అనుగ్రహించాక, వారిని దర్శించుకోవాలనీ, వారి గురించి మరిన్ని విషయాలు తెలుసుకోవాలని తపించిపోయారు శ్రీ అథావళె. 1942 ప్రాంతంలో శ్రీరమణుల గురించి మహారాష్ట్రలో ఎక్కువ మందికి తెలియనే తెలియదు. దాదాపు 12 రోజుల పాటు శ్రీరమణుల గురించి ఎంతో కొంత తెలుసుకోవాలని అథావళె చాలా ప్రయత్నించారు. సద్గురుని వైపు మనం ఒక అడుగు వేస్తే, వారు 99 అడుగులు మనవైపు వేసి, మనలను అక్కున జేర్చుకుంటారన్నది సత్యం. శ్రీ అథావళె పడిన తపనకు ప్రతిఫలంగా, అకస్మాత్తుగా వారి స్నేహితులలో ఒకరు వారిని సమీపించి, వారు రామేశ్వరం తీర్థయాత్ర చేసే మార్గంలో తిరువణ్ణామలైలో దిగి, శ్రీరమణమహర్షుల వారిని దర్శించుకున్నారని చెప్పారు. అథావళె గారిని కూడా అరుణాచలం వెళ్ళి, శ్రీరమణులను దర్శించుకోమని సలహా ఇచ్చారు. స్నేహితుని సలహాను పాటించి, అథావళె వెంటనే శ్రీ రమణాశ్రమం ప్రయాణమయ్యారు. వారు ఆశ్రమం చేరుకోగానే, శ్రీరమణులు వారి వైపు రావటాన్ని గమనించి, అథావళె శ్రీరమణులకు పాదాభివందనము చేశారు. ‘‘మీరు పూనా నుండి వచ్చారా? ఎంతో అలిసిపోయారు. కాస్త విశ్రమించండి’’ అని శ్రీరమణులు అన్నారు. రమణుల వాత్సల్యానికి అవధులు లేవని గ్రహించారు శ్రీ అథావళె.

మధ్యాహ్నం వేళ హాలులో శ్రీరమణుల సన్నిధిలో కూర్చున్నప్పుడు అథావళెగారి ఆరోగ్యం ఎలా ఉందని శ్రీరమణులు ప్రశ్నించారు. "ఎన్నో సంవత్సరాలుగా, సయాటికాతో బాధపడుతున్నాను, భగవాన్, రాత్రివేళల్లో కంటినిండా నిద్రపోయి ఎన్నో సంవత్సరా లయ్యింది. అంతేకాక, ఎందరో గొప్ప పేరున్న డాక్టర్లను సంప్రదించినా, ఈ నొప్పి నయం కావటం లేదండీ" అని విన్నవించు కున్నారు. అథావళె ఆందోళన వ్యక్తపరుస్తూ అన్న ఈ మాటలు విన్న భగవాన్, వారికి ధైర్యాన్ని ఇస్తూ, భగవద్గీత నుండి ఒక శ్లోకాన్ని వివరించి, "మీరు ఇచ్చట ప్రశాంతంగా ఉండవచ్చు. మీ నొప్పి తప్పక నయమౌతుంది" అని హామీ ఇచ్చారు.

శ్రీరమణులు ఇచ్చిన హామీతో అథావళె గారికి ఏనుగంత బలం వచ్చేసింది. ఇన్ని సంవత్సరాలుగా పట్టి పీడిస్తున్న నొప్పి శ్రీరమణుల అభయ వచనంతో ఖచ్చితంగా నయమౌతుందని వారికి అనిపించింది. అయితే, విశేషమేమిటంటే నిజంగానే మూడు నాలుగు నెలలో, నొప్పి నుండి పూర్తిగా నయమై, అథావళె, సంపూర్ణ అరోగ్యవంతులుగా మారారు. గురువాక్కు కున్న మహిమ, శక్తి వేరే ప్రస్తావించనేల?!! సయాటికా నొప్పి నుండి విముక్తులైనాక, శ్రీ అథావళె 1950వ సంవత్సరం వరకు, యేడాదికి 4 సార్లు శ్రీరమణాశ్రమం వచ్చి, శ్రీ భగవానులను దర్శించుకునేవారు.

శ్రీ రమణులు, మహాసమాధి నొందినపుడు అథావళె గారికి శ్రీరమణాశ్రమం నుండి టెలిగ్రామ్ వచ్చింది. టెలిగ్రామ్ రాగానే, వారు తిరువణ్ణామలై బయలుదేరి వెళ్ళారు. శ్రీరమణులను ఇక

దేహంతో చూడలేరనే బాధ వారిని ముంచెత్తింది. విషాదాన్ని, బాధని తట్టుకోలేక పోయారు, శ్రీ అథావళె. శ్రీరమణులు మహా సమాధి నొందిన రాత్రి, కన్నీరు పెట్టుకుని, ఎంతో బాధతో నిద్రలోకి వెళ్ళే ప్రయత్నం చేశారు అథావళె. ఇంతలో ఎవరో చేతిలో లాంతర పట్టుకుని, నెమ్మదిగా నడుస్తూ, వారిని సమీపించడాన్ని గమనించిన అథావళె ఎంతో ఆశ్చర్యపోయారు. చేతిలో లాంతర పట్టుకుని వారిని సమీపించినది ఎవరో కాదు. బాధపడుతున్న అథావళె గారిని ఓదార్చడానికి, సాక్షాత్తూ శ్రీరమణులే అచ్చటికి వచ్చారు. అథావళె గారిని సమీపించి, ఎంతో మృదుమధురమైన వాక్కుతో, "అథావళె, ఎందుకు ఏడుస్తున్నావు? నేను ఎల్లప్పుడు నీ చెంతనే ఉంటానని నీకు నేను చేసిన వాగ్దానం మరచిపోయావా! నేను ఇక్కడే ఉన్నాను" అని ఎంతో ప్రేమగా శ్రీరమణులు పలికారు. ఎదుట ప్రత్యక్షమైన గురు రమణులకు ప్రణమిల్లి, లేవగా, శ్రీరమణులు అంతర్ధాన మయ్యారు. నమ్మి, ఆరాధించే భక్తులకు, శ్రీరమణులు తోడు, నీడగా ఉంటారని మనం ఎల్లప్పుడు జ్ఞప్తియందుంచుకోవాలి!

**ఆత్మ సాక్షాత్కారము**

ప్రాకృతాని తు కర్మాణి ప్రకృతిః కర్మసమ్భవా ।
నైవ కించి త్కరో మీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ॥

తా॥ ప్రకృతి (మాయ) వలన కర్మలు గలిగినవి. మాయ కర్మ వలన గలిగినది; నేను దేనినిగాని కొంచెమైనను చేయుట లేదు; అని ఆత్మతోఁ జేరిన తత్త్వవేత్త తలఁచుచున్నాడు.

# Time

(Talk 54A)

Dr. K. Subrahmanian

At the beginning of every year, we wish each other, “Happy New Year”. This is a convention that is observed by many people in different parts of the world. Every culture has its own New Year; as to when it’s celebrated, it varies from culture to culture, from nation to nation. We have the Telugu New Year day, the Tamil New Year day, etc. This year, on 1 January, we said, “Wish you a very happy 1993.” The year 1993, of course, is with reference to the Christian calendar. The world has been in existence for millions of years, but we have chosen a particular calendar for our calculations. The other thing is, we talk about 1 January, but there is no such thing as 1 January. We say, 365 days roughly make a year, and when the 365 days are over, we wish one another a Happy New Year. Every year, we think that this new year will be better than the previous one. It is our sincere wish that we should have a happy new year, but we know in our heart of hearts, there is no such thing as a completely happy year or a completely unhappy year. What is a year? It is man-made; we have created it. For the sake of convenience, we say 365 days make a year. Similarly, the months, the days and dates are our creation. For example, is there something like 15 January in real life? No, there isn’t; it is just a

convention that we make use of. In fact, many people don’t know what January is. If you go to villages, they don’t talk about January, February, etc. They have a of concept of time that is very different from ours. What is it that they have that we don’t? While we have to look at the watch to tell what time it is, a villager will be able to tell you the approximate time by looking at the stars and the sun.

